# మి(మ)నీ కథా సంపాదకుడు

సుందర్రావుని చూడగానే "ఏమిటీ ప్రస్తుతం నీ సాహస క్రియలు?" అని అడగాలనిపించింది. ఐదేళ్ళకిందట అతనికో లాటరీ టిక్కెట్టు మూడువేల రూపాయలు తెచ్చి పెట్టింది. "ఈ డబ్బు పెట్టుబడిగా వ్యాపారం చేస్తాను" అన్నాడు. "ఉద్యోగమో?" అంటే అదీ వుంటుందన్నాడు. "ఉద్యోగం చేస్తున్నవాడు వ్యాపారం చెయ్యకూడదు కదా!", "తెలిసేటట్టు చెయ్యను" అన్నాడు. "నెలకి నూటికి మూడు రూపాయలు కిడితే చాలు" అనుకొని ప్రారంభించాడు. వాళ్ళ యింటాయన ఇతనుంటున్న వాటాకాక మిగతా ఇల్లు రిపేర్ చేయించుకుంటానంటే? ఆ రేటుకి ఆ డబ్బంతా అప్పిచ్చి ప్రారంభించాడు. రెండేళ్ళనాడు ఆ డబ్బు తిరిగొచ్చింది. ఆ తరవాత ఏం చేశాడో తెలీ లేదు. ఇదే కలవడం.

పుస్తకాలు ప్రచురిస్తున్నాను, అన్నాడు.

"మూడువేల రూపాయలు పెట్టుబడితో ఒక్క పుస్తకం వెయ్యొచ్చు, అంతేకదా" అన్నాను. కాగితం ధర, ప్రింటింగు ఖర్చులు దృష్టిలో పెట్టుకుని.

"ఏడాదికి మూడు పుస్తకాలు వేస్తున్నాను!" అన్నాడు.

"అదెలాగ?" అని నికార్సయిన సందేహం వెలిబుచ్చాను.

"గత మూడేళ్ళుగా మినీ కథ అని ఒక సాహిత్య ప్రక్రియ బయల్దేరింది. అట్టే శ్రమపడకుండా రాయొచ్చు, అంతకంటె తక్కువ శ్రమతో చదివి అవతల పారెయ్యొచ్చు.''

"జోకులా?"

"అవీ వుంటాయి, పొడిగించిన బాపతు."

"సరే_ బిజినెస్ సైడు చెప్పు!" అన్నాను.

"ఒకటో రెండో పత్రికల్లో ముందుగా వేస్తారు. మినీ కథల సంకలనం వేస్తున్నాము; రచనలు పంపండి అంటాను."

"ఆదాకి ముందే ఎడ్వర్ టెయిజ్‌మెంటు ఖర్చు " అన్నాను.

"ఎడ్వర్టయిజ్‌మెంటు అక్కర్లేదు, ఉత్తరాల శీర్షికలో వేస్తాం. రమణ సాహితి (లేక) సుందర సాహితి ప్రచురించే మినీ కథా సంకలనానికి రచనలు కావాలని. మొత్తం ఒకో సంకలనానికి మూడు బహుమతులు_ వందా, డెబ్భయ్యయిదు, యాభై రూపాయల చొప్పున. ఎంట్రీఫీజు రూపాయి."

"రెండువందల పాతిక ఎంట్రీలు వస్తాయా?"

''నాలుగువందల దాకా వస్తాయి."

"ఆ తరవాత?"

"బహుమతులు అనౌన్స్ చేశాక, ఓ అరవై కథలు సెలక్టుచేసి మీ కథ సంకలనంలో చేరుస్తున్నాము. అచ్చు ఖర్చుల నిమిత్తం యాభై రూపాయలు పంపండి; యాభై రూపాయల విలువగల కాపీలు పంపిస్తాము'' అంటూ ఉత్తరాలు రాస్తాము.

"ఎవరైనా పంపిస్తారా?"

"పంపుతారు. రాస్తున్నవాళ్లు సాధారణంగా స్టూడెంట్లు, లేకపోతే గృహిణులు, ఎవరూ సంపాదన పరులు కారు. అంచేత ఇంచుమించు అందరూ పంపిస్తారు. రెండువేల అయిదు వందలు ఖర్చుపెట్టి నూట పాతిక పేజీల పుస్తకం పదిహేను వందల కాపీలు వేస్తాను, పుస్తకం ధర ఆరు రూపాయిలు పెడతాను. ఆ లెక్కని అయిదు వందల కాపీలు రచయితలకి సరిపోతాయి. మనకి మిగిలేది అయిదు వందల రూపాయలు, వెయ్యి కాపీలు. ఆ వెయ్యికాపీలు మూడేసి రూపాయలకో, రెండున్నరకో యిచ్చేస్తే అదంతా మిగులే మళ్ళాను."

ఆశ్చర్యపడ్డాను సుందర్రావు తెలివికి.

"ఎన్ని పుస్తకాలు ప్రచురించావు?"

"ఇప్పటికి నాలుగు. పన్నెండువేలు మిగిలాయి."

"కొందరు రచయితలు పారితోషికం యివ్వందే రచనలు అచ్చు వేసుకోడానికి యివ్వరుగా, వాళ్ళని ఎలా టాకిల్ చేస్తున్నావు?"

"పారితోషికం కావాలని పట్టుపట్టే వాళ్ళకి అదీ యిస్తాను. ఎటొచ్చీ ద్రవ్యరూపంలో కాకుండా ద్రవరూపంలో యిస్తాను."

"అంటే?"

"మా వూరొచ్చినప్పుడు కలవండి, సరదాగా 'కూచుని' కబుర్లు చెప్పుకొందాం"- అని ఉత్తరం రాస్తాను. దాంట్లో ఆ అర్థం వుంది—లేదు!

"పోన్లే, ఏదో కథ నడిపిస్తున్నావన్నమాట!" అన్నాను.

"ఇంకో పాయింటు. మా పెద్దమ్మాయి, రెండో అబ్బాయి ఇప్పుడిప్పుడే చిన్న చిన్న మినీ కథలు రాస్తున్నారు. అవి సంకలనానికి ఒక్కొక్కరిది ఒక్కొక్కటి చొప్పున అచ్చు వేసుకోవచ్చు. అది మా ఆవిడకెంతో సుఖంగా వుంటోంది!" అంటూ వెళ్ళాడు సుందర్రావు.

(7-10-78)